సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 24 | ఏప్రిల్ | 2025



ఫొటో స్టూడియోలే వీరి టార్గెట్


రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దుకాణాలు, ఫొటో స్టూడియోల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను దేవరపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు.

4లో

ఓపెన్‌లోనూ టాప్ లేపారు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లోనూ బాలికలదే పైచేయిగా నిలిచింది.

డెల్టాకు 4,900 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 900, మధ్య డెల్టాకు 1,000, పశ్చిమ డెల్టాకు 3,000 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.20 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

ఉగ్రవాదం నశించాలి



రావులపాలెంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి తదితరులు

రావులపాలెం: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి నిరసిస్తూ బుధవారం రాత్రి రావులపాలెంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ ర్యాలీ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. కొత్తపేట నియోజకవర్గం లోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు స్థానిక పార్టీ కార్యాలయానికి చేరుకున్నాయి. అక్కడి నుంచి ఫ్లెక్సీలు, కొవ్వొత్తులు చేతపట్టి ఉగ్రదాడిని నిరసిస్తూ అమలాపురం రోడ్డు, ఆర్‌కే రెస్టారెంట్ జంక్షన్ మీదుగా కోనసీమ ముఖద్వారం వరకూ జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరావు, వైస్ ఎంపీపీ బొక్కా ప్రసాద్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, సర్పంచులు దొమ్మేటి అర్జునరావు, తమ్మన శ్రీను, సబ్బితి మోహనరావు, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కప్పల శ్రీధర్, కోనాల రాజు పాల్గొన్నారు.

అమానుషం : ఎమ్మెల్సీ త్రిమూర్తులు



కపిలేశ్వరపురం (మండపేట): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయకులైన పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు బుధవారం ఆయన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆర్మీ దుస్తుల్లో ఉగ్రవాదులు రావడం, పర్యాటకులను పొట్టనపెట్టుకోవడమనే అంశాలను తీవ్రంగా పరిగణించి లోతైన విచారణ చేపట్టాలన్నారు.

ఆనందోత్సాహం



డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషాను అభినందిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్

- పది ఫలితాల్లో కోనసీమ సత్తా
- రాష్ట్రంలో రెండో స్థానం
- 91.43 శాతం ఉత్తీర్ణత
- బాలికలదే పైచేయి

రాయవరం: పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. 91.43 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయుల్లో ఆనం'దో'త్సాహాలు నింపారు. పాఠశాల విద్యాశాఖ బుధవారం ఉదయం 10 గంటలకు ఫలితాలను విడుదల చేసింది. అదే విధంగా జోన్ – 2 పరిధిలో ప్రథమ స్థానంలో నిలవడం గమనార్హం. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషాతో పాటుగా జిల్లా యంత్రాంగాన్ని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనపై డీఈవో డాక్టర్ సలీం బాషా, డీవైఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, జి.సూర్యప్రకాష్, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదలతో ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు.

పదో తరగతి ఫలితాల వివరాలు	
హాజరైన విద్యార్థులు	18,871
ఉత్తీర్ణులైనవారు	17,253
బాలురు	9,392
బాలికలు	9,479
ప్రథమ శ్రేణి	14,504
ద్వితీయ శ్రేణి	1,900
తృతీయ శ్రేణి	849

బాలికల ముందంజ

పదో తరగతి ఫలితాల్లో ఈసారీ బాలికలే పైచేయి సాధించారు. 9,392 మంది బాలురు, 9,479 మంది బాలికలు కలిపి మొత్తం 18,871 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో బాలురు 8,420 (89.65 శాతం), బాలికలు 8,833 (93.18 శాతం) ఉత్తీర్ణులయ్యారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 18,871 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 17,253 మంది ఉత్తీర్ణత (91.43 శాతం) సాధించారు.

పటిష్ట ప్రణాళిక

పది ఫలితాల్లో జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడానికి జిల్లా విద్యాశాఖ ప్రణాళికా బద్ధంగా చేసిన కృషే కారణమని పలువురు చెబుతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారిగా డాక్టర్ షేక్ సలీం బాషా గతేడాది అక్టోబరు 29న బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పదో తరగతిపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటూ నిరంతరం పర్యవేక్షణ చేశారు. పదో తరగతి విద్యార్థులపై పాఠశాలల హెచ్‌ఎంలు, సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చేలా పర్యవేక్షణ చేసి, వంద రోజుల ప్రణాళిక అమలు చేశారు. సిలబస్‌ను త్వరగా పూర్తి చేయడం, వెంటనే రివిజన్ ప్రారంభించడం, విద్యార్థుల చదువుపై ఎప్పటి కప్పుడు పర్యవేక్షణ తదితర అనేక కారణాలు విజయానికి కారణమయ్యాయని చెప్పవచ్చు.

ప్రత్యేక శ్రద్ధ

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం కూడా మంచి ఫలితాలు రావడానికి కారణమైంది. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంల నుంచి ఆర్‌జేడీ స్థాయి వరకూ పదో తరగతిపై దృష్టి కేంద్రీకరించారు. నవంబర్ నెలాఖరుకు సిలబస్ పూర్తి చేసి, ప్రతి రోజూ రివిజన్ చేపట్టారు. జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు 63 రివిజన్ టెస్టులు, మూడు గ్రాండ్ టెస్టులు నిర్వహించారు. ఎస్‌సీఈఆర్‌టీ సరఫరా చేసిన మూడు మోడల్ పేపర్లు, స్టడీ మెటీరియల్, ఆడియో విజువల్ క్లిప్పింగులు విద్యార్థులకు ఉపయోగపడ్డాయి. అలాగే సబ్జెక్టు నిపుణులతో అన్ని సబ్జెక్టులకు సంబంధించి ఒక మార్కు ప్రశ్నలు ఆడియో క్లిప్పింగ్‌ల రూపంలో తయారు చేసి, ప్రత్యేక తర్ఫీదునిచ్చారు. ఇటువంటి చర్యలన్నీ మెరుగైన ఉత్తీర్ణతకు దోహదం చేశాయని పలువురు హెచ్‌ఎంలు చెబుతున్నారు.

మెరిసిన సర్కారీ స్కూళ్లు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది ఫలితాల్లో సత్తా చాటారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మార్కులు సాధించారు. మండలాల వారీగా కె.గంగవరం 98.32 శాతం ఉత్తీర్ణతతో మొదటి స్థానంలో నిలిచింది. ఉప్పలగుప్తం 98.19, కాట్రేనికోన 97.98 శాతం ఉత్తీర్ణతతో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. రామచంద్రపురం 81.63 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచింది.

నూరుశాతం ఉత్తీర్ణత

జిల్లాలోని 147 పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. వీటిలో 103 ప్రైవేట్, 44 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అలాగే 5,947 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారు. వీరిలో 2,571 మంది ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులు ఉండగా, 3,376 మంది ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల విద్యార్థులున్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లా ప్రథమం సాధించిన కొల్లా హారికను అభినందిస్తున్న అబ్జర్వర్ అబ్దుల్ గని, ఉపాధ్యాయులు

ఇరుసుమండ విద్యార్థుల ప్రతిభ

మలికిపురం: మండలంలోని ఇరుసుమండ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాలలో జిల్లా స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. కొల్లా హారిక 592, వీఎల్‌వీఎస్‌ఎస్ దీపక్ 591 మార్కులు సాధించారు. వీరిని పాఠశాల స్టడీ మెటీరియల్ స్టేట్ అబ్జర్వర్ అబ్దుల్ గని అభినందించారు. ఆయన బుధవారం పాఠశాలను సందర్శించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్వీట్లు తినిపించి అభినందించారు. కార్యక్రమంలో సీఎంఓ సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారి ఎం.విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహర్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టానికి ఫలితం



పది ఫలితాలు సంతృప్తినిచ్చాయి. రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో నిలవడం సంతోషానిచ్చింది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు ప్రత్యేక తరగతులు, నిత్యం పర్యవేక్షణ చేయడంతో ఈ ఫలితాలు సాధించాం. ఈ విజయంలో భాగస్వాములైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు అభినందనలు.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈవో, అమలాపురం

ఫలితాలు స్ఫూర్తినిచ్చాయి



పది ఫలితాలు స్ఫూర్తినిచ్చాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పడిన కష్టానికి ఫలితాలే నిదర్శనం. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీం బాషా నేతృత్వంలో ఎప్పటికప్పుడు తీసుకున్న నిర్ణయాలు ఉత్తమ ఫలితాలకు కారణమయ్యాయి. విద్యార్థులకు అభినందనలు.

– బి.హనుమంతరావు అసిస్టెంట్ కమిషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, అమలాపురం

పత్రికలపై దాడులు అనైతికం

- ఏలూరులో 'సాక్షి' కార్యాలయంపై దాడి దారుణం
- టీడీపీ గుండాల తీరుపై ఆగ్రహం
- నిరసన తెలిపిన పాత్రికేయులు



అమలాపురం ఆర్డీవో మాధవికి వినతిపత్రం అందజేస్తున్న మండెల నాగ వెంకట ప్రసాద్ (బాబీ), కొండేపూడి సత్యనారాయణ, సుంకర ప్రసాద్, నిమ్మకాయల సతీష్ బాబు తదితరులు

సాక్షి, అమలాపురం: పత్రికలపైనా, మీడియా సంస్థలపై దాడులు జరగడం అనైతికమని, ఇది ముమ్మాటికీ ప్రశ్నించే గొంతుకను నొక్కివేయడమేనని వివిధ పాత్రికేయ సంఘాల సభ్యులు, ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరులోని సాక్షి పత్రిక కార్యాలయంపై టీడీపీకి చెందిన దుండగలు దాడి చేయడంపై కోనసీమ జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో బుధవారం నిరసన ప్రదర్శనలు జరిగాయి. అనంతరం రెవెన్యూ, పోలీసు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

- జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఐజేయూ సభ్యుడు మండెల నాగ వెంకట ప్రసాద్ (బాబీ), అమలాపురం ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొండేపూడి సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి సుంకర ప్రసాద్, 'సాక్షి' అమలాపురం స్టాఫ్ రిపోర్టర్ నిమ్మకాయల సతీష్ బాబు ఆధ్వర్యంలో వివిధ సంఘాలకు చెందిన పాత్రికేయులు ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సాక్షి కార్యాలయంపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని, పత్రికల స్వేచ్ఛను కాలరాస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం అమలాపురం ఆర్డీవో కె.మాధవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు విజయ్, పరసా సుబ్బారావు, అరిగెల రుద్ర శ్రీనివాస్, కట్టా మురళీకృష్ణ, నల్లా విజయ్ పాల్గొన్నారు.
- రాజోలు నియోజకవర్గ పరిధిలో వివిధ పాత్రికేయ సంఘాలకు చెందిన ప్రతినిధులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.నగేష్ కుమార్, రాజోలు తహసీల్దార్ ఎస్‌ఎస్‌ఎస్ ప్రసాద్‌లకు వినతి పత్రాలు అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడు తోట సత్యనారాయణ (చంటి), ఉపాధ్యక్షుడు కె.సురేంద్ర, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, కార్యదర్శి వీవీ నాగేశ్వరరావు, వీఎస్ఆర్ బాపూజీ పాల్గొన్నారు.
- పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అంబాజీపేట మండలంలో ఏపీడబ్ల్యూజేఎఫ్, నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో పాత్రికేయులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోశాధికారి మట్టపర్తి శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు సీఎస్ మూర్తి, తెలగరెడ్డి దుర్గా శంకర్, మట్టపర్తి రాములు పాల్గొన్నారు.
- మండపేట నియోజకవర్గం పరిధిలో కపిలేశ్వరపురం మండల డిప్యూటీ తహసీల్దార్‌కు పాత్రికేయులు వినతిపత్రం అందజేశారు. పాత్రికేయులు దేవ సహాయం, పి.లెనిన్ బాబు, చిట్టికుమార్, శేఖర్ పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

క్లుప్తంగా

యువకుడి మృతదేహం లభ్యం

రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడి శివారు ఏలేరు ఎడమ కాలువలో మంగళవారం సాయంత్రం గల్లంతైన గుమ్మరేగులకు చెందిన వెంటూరి జయబాబు (29) మృతి చెందాడు. గుమ్మరేగుల సమీపంలోని ఏలేరు కాలువలో కొట్టుకుపోతున్న మృతదేహాన్ని బుధవారం స్థానికులు చూసి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసుల సహకారంతో కొట్టుకుపోతున్న మృతదేహాన్ని బయటకు తీశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

వడదెబ్బతో పారిశుధ్య కార్మికుడి మృతి

ముమ్మిడివరం: వడదెబ్బకు తాళలేక పారిశుధ్య కార్మికుడు స్పృహ తప్పి పడిపోయి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ముమ్మిడివరంలో కాకి లక్ష్మణరావు (70) అనే పారిశుధ్య కార్మికుడు మంగళవారం మధ్యాహ్నం ఎండ వేడికి తాళలేక స్పృహ తప్పి పడిపోయాడు. అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. లక్ష్మణరావుకు భార్య సూర్యావతి, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై ఎస్సై డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాటాకిల్లు దగ్ధం

రావులపాలెం: మార్కెట్ రోడ్డులోని మారుతీ నగర్ సమీపంలో ఒక తాటాకిల్లు బుధవారం కాలిపోయింది. సమాచారం అందుకున్న కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘటన ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బయట నుంచి వేసిన తారాజువ్వ కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు అడపా ప్రసాద్ తెలిపాడు.

ఫొటో స్టూడియోలే వీరి టార్గెట్



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాయక్, చిత్రంలో నిందితులు (ముసుగుల్లో ఉన్నవారు)



దొంగల ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న కెమెరాలు

- విలువైన కెమెరాల చోరీ
- ఆరుగురు ముఠా సభ్యుల్లో ఒకరు మహిళ
- అరెస్టు చేసిన దేవరపల్లి పోలీసులు

దేవరపల్లి: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో దుకాణాలు, ఫొటో స్టూడియోల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను దేవరపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ముఠాలోని ఆరుగురు సభ్యుల్లో ఒకరు మహిళ కావడం విశేషం. దేవరపల్లి పోలీస్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ బి.నాగేశ్వర్ నాయక్ ఆ వివరాలు వెల్లడించారు. గుంటూరుకు చెందిన షేక్ సమీర్ (ఫైజల్), విజయవాడలోని ప్రసాదంపాడుకు చెందిన అల్లాడి నాగమణికంఠ ఈశ్వర్ (మణి), తెలంగాణలోని కోదాడ మండలానికి చెందిన నాగదాసరి ఒమెసిన్ మస్(సిమ్), చిలకలూరిపేటకు చెందిన రామిశెట్టి దేవీ ప్రసాద్, కోదాడకు చెందిన మునగంటి గోపి, పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడుకు చెందిన కొల్లి వెంకట సూర్యసత్యమణిసాయి ముఠాగా ఏర్పడి పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వీరందరూ విజయవాడలో కారును అద్దెకు తీసుకుని దొంగతనాలకు ఉపయోగిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో దేవరపల్లి మెయిన్ రోడ్డులోని ఆర్‌కే డిజిటల్ స్టూడియోలో, నిడదవోలులోని రెండు ఫొటో స్టూడియోల్లో దొంగతనం చేశారు. రెండుచోట్లా కెమెరాలు, కంప్యూటర్ పరికరాలు, రెండు హార్డ్ డిస్కులు, ప్రింటర్ దొంగిలించారు. ఈ చోరీలపై దేవరపల్లి, నిడదవోలు పోలీస్ స్టేషన్లలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అద్దె కారులో రెక్కీ..

ముఠా సభ్యులందరూ ఒక కారును అద్దెకు తీసుకుని దాని నంబర్ ప్లేటు తీసేస్తారు. దొంగతనం చేయబోయే ప్రదేశంలో రెక్కీ నిర్వహిస్తారు. కొన్ని షాపులు, ఇళ్లను ఎంపిక చేసుకుని రాత్రి సమయంలో ఇనుపరాడ్డులను ఉపయోగించి షట్టర్లు, తాళాలను బద్దలుకొట్టి దొంగతనం చేస్తారు. దేవరపల్లిలో జరిగిన దొంగతనానికి సంబంధించి జరుగుతున్న దర్యాప్తులో భాగంగా బుధవారం ఎస్సై వి.సుబ్రహ్మణ్యం స్థానిక డైమండ్ జంక్షన్ వద్ద ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.5 లక్షల విలువైన కెమెరాలు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి కొవ్వూరు కోర్టుకు హాజరుపర్చారు. దొంగతనాలకు ఉపయోగిస్తున్న కారు, బుల్లెట్ వాహనాన్ని సీజ్ చేసినట్టు ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో గోపాలపురం ఎస్సై కె.సతీష్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ భీమరాజు, కానిస్టేబుళ్లు బాలచంద్రరావు, సలీం, పండు, దుర్గారావు, గోపాలపురం స్టేషన్ సిబ్బంది కుమార స్వామి, గోవింద్, నాగేంద్ర, వెంకట్ ఎంతో సహకరించారన్నారు. నిందితులపై వివిధ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు ఉన్నట్టు తెలిపారు.

ఓపెన్‌లోనూ టాప్ లేపారు

- వెలువడిన ఓపెన్ స్కూల్ ఫలితాలు
- సత్తా చాటిన విద్యార్థులు

రాయవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం నిర్వహించిన పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లోనూ బాలికలదే పైచేయిగా నిలిచింది. గత నెల 17 నుంచి 28 వరకూ ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. ఓపెన్ టెన్త్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో కాకినాడ (84.90 శాతం), తూర్పుగోదావరి (81.51), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ (77.86 శాతం) జిల్లాలు నిలిచాయి. ఈ పరీక్షలకు కాకినాడ జిల్లా నుంచి 2,066 మంది హాజరు కాగా 1,754 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 83.05, బాలికలు 86.83 శాతం ఉత్తీర్ణులయ్యారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి 2,299 మంది పరీక్షకు హాజరు కాగా, 1,874 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత 79.18గా, బాలికల ఉత్తీర్ణత 84.36 శాతంగా ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 1,102 మంది విద్యార్థులు హాజరు కాగా, 858 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలుర ఉత్తీర్ణత 73.77 శాతం, బాలికల ఉత్తీర్ణత 83.30 శాతంగా ఉంది.

ఇంటర్ ఫలితాల్లో..

ఓపెన్ ఇంటర్ ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ (82.15 శాతం), కాకినాడ (80.88 శాతం), తూర్పుగోదావరి (79.75 శాతం) జిల్లాలు మంచి ఉత్తీర్ణత సాధించాయి. కోనసీమ జిల్లా నుంచి 4,442 మంది పరీక్షకు హాజరు కాగా 3,649 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో బాలురు 80.60, బాలికలు 84.36 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాకినాడ జిల్లా నుంచి 6,395 మంది పరీక్షకు హాజరు కాగా 5,172 మంది పాసయ్యారు. బాలుర ఉత్తీర్ణత 80.49, బాలికల ఉత్తీర్ణత 81.42 శాతంగా ఉంది. తూర్పుగోదావరి జిల్లా నుంచి 4,588 మంది పరీక్షలు రాయగా, 3,659 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర ఉత్తీర్ణత 77.53, బాలికల ఉత్తీర్ణత 82.45 శాతంగా ఉంది. రాష్ట్ర స్థాయి ఫలితాల్లో కోనసీమ మొదటి స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో కాకినాడ, నాలుగో స్థానంలో తూర్పుగోదావరి జిల్లాలు నిలిచాయి.

రీ వెరిఫికేషన్‌కు అవకాశం

ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ఫెయిలైనవారు రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. వాటికి ఈ నెల 26 నుంచి మే 5వ తేదీ వరకూ ఏపీ ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఫీజు చెల్లించాలి. ప్రతి సబ్జెక్టు జవాబు పత్రం రీకౌంటింగ్‌కు రూ.200, రీ వెరిఫికేషన్‌కు రూ.1,000 చెల్లించాల్సి ఉంటుంది. ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు రెగ్యులర్ ఎస్ఎస్‌సీ సప్లిమెంటరీ పరీక్షల టైమ్ టేబుల్‌ను అనుసరించి జరుగుతాయి. వాటిని మే 19 నుంచి 24వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇంటర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు మే 26 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్నాయి. పరీక్షా రుసుమును ఈ నెల 26 నుంచి మే 5వ తేదీ వరకు ఏపీటీ ఆన్‌లైన్ ద్వారా ద్వారా లేదా పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించవచ్చు.

'పది'లో మార్కులు తక్కువొచ్చాయా..

- రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోండి
- నేటి నుంచి మే ఒకటి వరకూ అవకాశం
- మే 19 నుంచి 28 వరకూ సప్లిమెంటరీ పరీక్షలు

రాయవరం: పదో తరగతి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించారు. అయితే కొందరు తమకు తక్కువ మార్కులు వచ్చాయని భావిస్తున్నారు. ఇలాంటి వారందరూ పునఃమూల్యాంకనం (రీవెరిఫికేషన్)కు దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికోసం సబ్జెక్టుకు కొంత ఫీజు చెల్లించాలి. ఈ దరఖాస్తులకు గురువారం నుంచి మే ఒకటో తేదీ వరకూ అవకాశం ఉంది. ఈ ఏడాది పది పరీక్షలు రాసిన విద్యార్థులు పాసైనా/ఫెయిలైనా పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చు. వీటిలో రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్ అనే రెండు రకాలు ఉంటాయి. రీవెరిఫికేషన్‌లో విద్యార్థికి సమాధాన పత్రాన్ని పరిశీలిస్తారు. వచ్చిన మార్కులను లెక్కిస్తారు. దిద్దని ప్రశ్నలు ఉంటే మార్కులు కేటాయిస్తారు. ఆ విద్యార్థికి జవాబుపత్రాన్ని స్కానింగ్ చేసి అందజేస్తారు. రీ కౌంటింగ్‌లో కేవలం మార్కులను మాత్రమే మరోసారి లెక్కిస్తారు. స్కానింగ్ పేపరు ఇవ్వరు. రీ వెరిఫికేషన్ కోసం సబ్జెక్టుకు రూ.వెయ్యి చొప్పున, రీకౌంటింగ్‌కు రూ.500 చొప్పున చెల్లించాలి. పాఠశాల లాగిన్ ద్వారా ప్రధానోపాధ్యాయులు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 9,288 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షల్లో ఫెయిలయ్యారు. వీరందరి కోసం మే 19 నుంచి 28 వరకూ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. వీటికి హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలి. ఈ మేరకు ప్రతి పాఠశాల హెచ్‌ఎం/సిబ్బంది విద్యార్థులకు అందుబాటు ఉండాలని ఇప్పటికే డీఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 24 నుంచి 30వ తేదీ వరకూ అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించొచ్చు. మే ఒకటి నుంచి విద్యార్థి రాసే మొదటి పరీక్ష ముందు రోజు వరకు రూ.50 అపరాధ రుసుముతో సంబంధిత పాఠశాల హెచ్‌ఎం ద్వారా ఫీజు చెల్లించొచ్చు.

శ్రీ ప్రకాష్ విద్యార్థుల అత్యున్నత ప్రతిభ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. నందవరపు భానుతేజస్ 594, సామిరెడ్డి గీతిక 593, కడిమి అర్చన 592, ఎస్.రుత్విక 592, ఎం.స్నేహిత్ 590 మార్కులు సాధించారని పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్ ప్రకాష్ తెలిపారు. 550కు పైగా 91 మంది, 500కు పైగా 155 మంది మార్కులు సాధించి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఆ విద్యార్థులను శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు, ప్రిన్సిపాల్ మూర్తి అభినందించారు.

ఆదిత్య విద్యాసంస్థల విజయభేరి



మహిత్ నాయక్ (596)



సత్యసూర్యతేజ (596)

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ఏబీబీవీ సత్యసూర్యతేజ, బి.మహిత్ నాయక్ 596 మార్కులు సాధించారని ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి బుధవారం తెలిపారు. తమ విద్యాసంస్థల నుంచి 590కి పైగా 53 మంది, 550కు పైగా 465 మంది మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ ఎస్‌వీ రాఘవరెడ్డి అభినందించారు.

పది ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పూర్ణచంద్రరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పదవ తరగతి ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు కె.లాస్య, ఎంఎల్‌పీ సమన్విత 595 మార్కులు సాధించి ప్రతిభ చూపారని ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ నూతలపాటి పూర్ణచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీహెచ్.మధుమిత, జి.భువన 592 మార్కులు, జి.హిమబిందుసాయి, జీటీఎస్ హృతిక. కేవీ రాఘవ 591 మార్కులు సాధించారన్నారు. గణితం, సైన్స్‌లో వందకు వంద మార్కులు వచ్చాయని తెలిపారు. 591 మార్కులకు పైగా 7గురు, 580కు పైగా 21మంది, 570కు పైగా 41మంది, 560కు పైగా 62 మంది, 550కి పైగా 89 మంది, 540కు పైగా 114 మంది మార్కులు సాధించారన్నారు.

బాలికపై యువకుడి లైంగిక దాడి

అన్నవరం: అన్నవరంలో పదేళ్ల బాలికపై 20 ఏళ్ల యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక పెట్రోల్ బంకు వెనుక గల ఒక ఇంటి వద్ద ఆడుకుంటున్న బాలికను పక్కింటి ఆమె దుకాణానికి వెళ్లి పంచదార తెమ్మని పంపించింది. ఆ బాలిక దుకాణానికి వెళ్లి పంచదార కొనుగోలు చేసి ఇంటికి తెచ్చింది. ఆ సమయంలో పక్కింటి ఆమె ఇంట్లో లేదు. ఆమె కొడుకు 20 ఏళ్ల కొల్లు సతీష్ ఉన్నాడు. అతడు ఆ పంచదార వంటింట్లో పెట్టాలని చెప్పాడు. బాలిక వంటింట్లోకి వెళ్లగానే తలుపునకు గెడపెట్టి ఆ బాలిక మీద లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం బాలిక తల్లికి ఆలస్యంగా తెలియడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీహరి బాబు తెలిపారు.

ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్‌గా రాజ్‌కుమార్



రాజ్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్‌గా కత్తుల రాజ్‌కుమార్ బుధవారం రాజమహేంద్రవరంలోని జోనల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన కరీంనగర్ జోన్ నుంచి పదోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. రాజమహేంద్రవరం జోన్ పరిధిలోని కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 64 శాఖలకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తారు. ఇప్పటి వరకు జోనల్ కార్యాలయం పరిధిలో రూ.10,037 కోట్ల వరకు వ్యాపారం జరిగినట్లు బ్యాంక్ వర్గాలు తెలిపారు.

25న ప్రవేశ పరీక్షలు

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో 2025- 26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన ప్రవేశ పరీక్ష శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. పరీక్ష ఫలితాలను మే 14వ తేదీన విడుదల చేస్తారన్నారు. అలాగే అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జూనియర్ ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష జరుగుతుందన్నారు. ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ డిగ్రీ కాలేజీల్లో పలు కోర్సుల్లో ప్రవేశానికి సైతం అదే రోజు పరీక్ష జరుగుతుంది.

హత్య కేసు రీ ఓపెన్

కాకినాడ క్రైం: ఎమ్మెల్సీ అనంతబాబుకు సంబంధించిన కేసును రీ ఓపెన్ చేయాలని ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాలు జారీ చేశారు. 2022లో అనంతబాబు తన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడ ఎస్‌డీపీవో మనీష్ దేవరాజ్ పాటిల్‌ను విచారణ అధికారిగా నియమించారు. 60 రోజుల్లో దర్యాప్తు నివేదికను తనకు సమర్పించాలని ఆదేశాలలో పేర్కొన్నారు.

34,591 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

అల్లవరం: జిల్లా వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి బుధవారం నాటికి 34,591.60 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం. బాల సరస్వతి బుధవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన 'కళ్లాల్లో ధాన్యం, నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు' కథనంపై పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించారు. అల్లవరం మండలంలో 18 రైతు సేవా కేంద్రాలు ద్వారా 395.720 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా అల్లవరం మండలంలో 1854 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ఉందన్నారు. అమలాపురం రూరల్ పరిధిలో 22 రైతు సేవా కేంద్రాల ద్వారా 1040 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు.

'దిశా'కు ప్రజాప్రతినిధుల డుమ్మా



దిశా సమావేశంలో పాల్గొన్న ఎంపీ హరీష్ మాధుర్

సాక్షి, అమలాపురం: కేంద్ర ప్రయోజిత పథకాల అమలుతో పాటు జిల్లా స్థాయిలో జరిగే అభివృద్ధి పనుల మీద నిర్వహిస్తున్న దిశా సమావేశానికి అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధుల గైర్హాజరు కావడం విస్మయానికి గురి చేసింది. అమలాపురం కలెక్టరేట్‌లో బుధవారం ఎంపీ గంటి హరీష్ మాధుర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండపేట శాసన సభ్యుడు, అంచనాల కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన మంత్రి వాసంశెట్టి సుభాష్, అధికార టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. ఈ సమావేశంలో ప్రతిపక్షాల గొంతును నొక్కి వేస్తుండడం, వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్సీలకు మాట్లాడే అవకాశం లేకపోవడంతో వారు పాల్గొనేందుకు పెద్దగా మక్కువ చూపడం లేదు. కుంటుపడిన అభివృద్ధిపై ఎవరైనా ప్రశ్నించినా బయటకు రాకుండా మీడియాకు సైతం ప్రవేశం లేకుండా చేశారు. అయితే అధికార పార్టీకి చెందిన వారూ పాల్గొనక పోవడం గమనార్హం. అమలాపురంలో జరిగిన ఒక ప్రైవేట్ మోటార్ సైకిల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లాకు చెందిన రాష్ట్ర కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ అమలాపురంలోనే జరిగిన దిశాకు ముఖం చాటేశారు. కాగా.. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా ఆర్థిక ఫలాలు లబ్ధిదారులకు అందించడంలో అధికారులు కీలక భూమిక పోషించాలని స్థానిక పార్లమెంట్ సభ్యుడు జి.హరీష్ మాధుర్ అన్నారు. జిల్లా పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల తీరుతెన్నులు, సమస్యలు, ఎదురవుతున్న సవాళ్లు, అధికారుల సమన్వయం తదితర అంశాలపై స్థానిక కలెక్టరేట్లో బుధవారం జరిగిన దిశ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఊడిమూడిలంక వంతెన పనుల పరిశీలన




ఊడిమూడి వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఐఐబీ బృందం

పి.గన్నవరం: నాలుగు లంక గ్రామాల ప్రజల కోసం వశిష్ట నదీపాయపై నిర్మిస్తున్న వంతెన పనులను ఏఐఐబీ టీమ్ బుధవారం పరిశీలించింది. ఇంతవరకూ పనుల పట్ల టీమ్ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజల కోసం గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.49.5 కోట్లు మంజూరు చేయించిన విషయం విదితమే. ఇంతవరకూ సుమారు రూ.32 కోట్ల వ్యయంతో 60 శాతం మేర పనులు పూర్తిచేశారు. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో కలిసి ఏఐబీ టీమ్ లీడర్ పవన్ ఖర్గీ (నేపాల్), సభ్యులు మాయా గాబ్రియల్ (ఫిలిప్పీన్), ఫ్రాన్సిస్ లార్డ్ సవెల్ల (ఫిలిప్పీన్), జోష్యుల శివరామశాస్త్రి (భారత్, ఏపీ), యోగేష్ బామ్ మల్ల (నేపాల్), ఎ.ముఖరాజ్ (కర్నాటక), అశోక్‌కుమార్ (ఢిల్లీ)లు వంతెన పనులను పరిశీలించారు. ఇంతవరకూ పనుల ప్రగతిని డిప్యూటీ ఈఈ అన్యం రాంబాబు బృంద సభ్యులకు వివరించారు.

స్థానిక స్వపరిపాలనకే పంచాయతీరాజ్

- వ్యవస్థల విధుల నిర్వహణపై స్పష్టత
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్ద పీట
- నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం



ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల అభ్యున్నతి, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కోసం జాతీయ పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైంది. పేదరిక నిర్మూలన ధ్యేయంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలను అందించే లక్ష్యంగా 1992లో అప్పటి కేంద్ర ప్రభుత్వం 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. భారత దేశంలో ఈచట్టం 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సమితి వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి తొలి స్థానిక స్వపరిపాలన వ్యవస్థ అయిన గ్రామ పంచాయతీలకు తోడుగా మూడంచెల విధానంలో మండల ప్రజా పరిషత్, జిల్లా పరిషత్‌లు ఏర్పడ్డాయి. అలాగే 2009 లో మరోసారి జరిపిన 110వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ పితామహుడు బలవంత్‌రాజ్ మెహతా కమిటీ సిఫారసుల మేరకు ఆధునిక పంచాయతీరాజ్ వ్యవస్థకు తిరిగి రూపకల్పన జరిగింది. రాజ్యాంగ సవరణ ద్వారా రూపొందించిన పంచాయతీరాజ్ చట్ట నియమావళి ఆధారంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు విధులు నిర్వహిస్తూ గ్రామీణ వ్యవస్థ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారు.



గ్రామ సచివాలయం

గ్రామాల అభివృద్ధికి మూడంచెల పద్ధతి

జాతీయ పంచాయతీరాజ్ వ్యవస్థ అమలు చేస్తున్న మూడంచెల పద్ధతి ప్రకారం విధుల నిర్వహణలో స్పష్టమైన విధానం ఉంటుంది. జిల్లా స్థాయిలో జెడ్పీటీసీలు, మండల స్థాయిలో ఎంపీటీసీలు, గ్రామ స్థాయిలో సర్పంచ్‌లు అభివృద్ధిలో భాగస్వాములు అవుతారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందే నిధులను మండల ప్రజా పరిషత్‌కు జిల్లా పరిషత్ కేటాయిస్తుంది, అలాగే మండల స్థాయిలో నిర్ణయించే బడ్జెట్‌ను జిల్లా పరిషత్ ఆమోదించి ఆ మేరకు నిధులను కేటాయిస్తుంది. మండల ప్రజా పరిషత్‌కు ఏవిధమైన పన్నులు విధించే అవకాశం లేనందున జిల్లా పరిషత్, రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులను మాత్రమే గ్రామ పంచాయతీలకు కేటాయిస్తుంది. ఇక గ్రామ పంచాయతీలైతే స్వయంగా నిధులను సమకూర్చుకోవడంతో పాటు మండల, జిల్లా పరిషత్ కేటాయించే నిధులతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటుంది. గ్రామీణ ప్రజల పౌర సౌకర్యాలు కల్పించడం, ప్రజా హక్కులకు భంగం వాటిల్లకుండా పరిరక్షించడం పంచాయతీరాజ్ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుంది.

తెల్లదోమను ముందుగా గుర్తిస్తే అరికట్టొచ్చు

అంబాజీపేట: కొబ్బరి, కోకో పంటలను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తున్న తెల్లదోమను రైతులు ముందుగా గుర్తిస్తే, నివారణా చర్యల ద్వారా అరికట్టవచ్చని విజయవాడ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి కేవీ చౌదరి అన్నారు. కేంద్ర సమగ్ర తెగులు నిర్వహణ కేంద్రం, వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంబాజీపేట, అమలాపురం, అల్లవరం మండలాల్లోని కొబ్బరి తోటలను బుధవారం ఉద్యానశాఖ అధికారులు, వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా కేవీ చౌదరి మాట్లాడుతూ కేరళ, తమిళనాడులలో తెల్లదోమ ప్రభావం చాలా ఎక్కువగా ఉందని, మన రాష్ట్రంలో ఎలా ఉందో పరిశీలన చేసి, కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు వచ్చామన్నారు. కొబ్బరిలో పొట్టి, హైబ్రీడ్ రకాలు ఉన్న ప్రాంతాల్లో ఈ తెల్లదోమ ఉధృతి అధికంగా ఉందన్నారు. అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు మాట్లాడుతూ అరటి పంటకు సంబంధించి తెగుళ్లు, పురుగులు ఉన్న ఫోటోలను నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే నివారణా చర్యలను రైతులకు తెలియజేస్తున్నామన్నారు. అలాగే కొబ్బరి, కోకో పంటలను కూడా ఈ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. పరిశోధన కేంద్రం ద్వారా తెల్లదోమ నివారణకు పురుగులను ఉద్యాన శాఖ అధికారుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ గోవర్ధన్, జిల్లా ఉద్యాన శాఖాధికారి బీవీ రమణ మాట్లాడారు. అనంతరం పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఉద్యాన శాఖాధికారి దిలీప్, వెంకటేశ్వరరావు, హెచ్ఏఏలు పాల్గొన్నారు.